# మినీకథ

## బాలపత్తేదారు

స్నేహానంద్

ఆ రోజు ఉదయం బాచికి ఎందుకనో పెందలాడే మెలుకువ వచ్చింది. అమ్మ పనిమనిషితో ఏదో పెద్దగొంతుతో చెపుతూంది.

"తెల్లవారి లేచి చూస్తే దొడ్డిగుమ్మం లోన గడితీసి వుంది! గుండె గుభేల్మంది! రోజులు బాలేవుగదా! లక్ష్మిగాని పెద్దాడుగాని తలుపు తీసి పెరట్లోకి వెళ్ళారేమోనని చూస్తే ఇద్దరూ నిద్రపోతున్నారు! సామానేమైనా పోయిందేమో చూడాలే రామీ!"

"ఏందో నమ్మగారూ! పక్కింటిలోగూడా ఇలాగే సందుతలుపులోంచి దొంగోడొచ్చి సామాను గాజేశాడు. మీరు లేపినేళ మంచిది గాబోలు—ఏమీ పోలేదులాగుంది!" అంది రామి.... ఇల్లంతా వెతికి ఏమీ పోలేదని యజమానులు నిర్ధారించుకొన్నాక!

రాత్రి దొడ్డిదోవన దొంగ లోపలకు వచ్చాడని బాచీ కర్థం అయింది! ఒక్క ఉదుటున పరుగెత్తుకొని వెళ్ళి తన మంచం కింది పాత చెక్కపెట్టె తీశాడు.

ఎనిమిదేళ్ళ బాచీ 'సర్వస్వం' అందులోనే వుంది! ఇన్నాళ్ళుగా కష్టపడి పోగు చేసుకున్న సిగరెట్ పెట్టెలు, గోల్డ్‌స్పాట్ మూతలూ, పాతసీసాలూ, అగ్గిపెట్టెలు, ఆడి విరగ్గొట్టిన బొమ్మలూ, గోళీలు, చాకుపీసుముక్కలూ, పెన్సిలు తుంపులూ, రంగుకాయితాలూ, చాక్‌లెట్ పేపర్లూ అన్నీ తిరగతోడి చూసుకుని ఏమీ పోలేదని తెలుసుకున్నాక ధైర్యంగా పెరట్లో వున్న అమ్మ దగ్గరకు బయల్దేరాడు.

"బాచీ బాబూ! రాత్రి దొంగాడొచ్చాడు" రామి దారిలో పెద్దరహస్యం చెపుతున్నట్లుగా అంది.

"నా పేరు బాచీగాదు! భాస్కర్" అన్నాడు కోపంగా!

"సదువురాని మొద్దుని! నాకా మత లబులేం తెలుత్తాయి బాబూ?" అంది రామి.

ఇంతలో బాచీ అక్క లక్ష్మి కూడా లేచి వచ్చింది. తండ్రి అంతకుముందే లేచి ఇల్లంతా పరిశీలించి చూస్తున్నాడు!

"అమ్మా! నీ ముక్కుపుడకేదే?" అంది లక్ష్మి. చప్పున చేయి ముక్కు మీదకు పోనిచ్చి "అయ్యో! నా తెలివి తెల్లార! ఏదే ముక్కుపుడక?" అంది అమ్మ.

"రాత్రి పడుకునేప్పుడు తీశావా?" అడిగింది లక్ష్మి. "తియ్యలేదే? ఏమో సరిగా గుర్తు రావడం లేదు! అయ్యో బంగారం లాంటి ముక్కు పుడక! మీ నాయనమ్మ ఎంతో ప్రేమగా చేయించి యిచ్చింది కాపురానికొచ్చిన కొత్తలో! అప్పట్నించి పెట్టుకుంటున్నా! పుష్యరాగం వేసి చేయించింది. ఈ రోజు దొంగాడు పొట్టన పెట్టుకున్నాడు" బాధపడుతోంది అమ్మ.

నాన్న వచ్చి "మళ్ళీ సరిగా చూడు, నగల పెట్టెలో ఏమయినా వుందేమో? దొంగాడు ఏమీ తీసికెళ్ళకుండా నీ ముక్కు పుడక ఒక్కటే కాజేస్తాడా? అయినా రాత్రి అన్నం వడ్డించేప్పుడు నీ ముక్కున పుడకలేదే" అన్నాడు.



"అవునమ్మా! రాత్రి అన్నం వడ్డించేటప్పుడు నీ ముక్కున పుడక లేదే!" అంది లక్ష్మి.

"అవునే.... సాయంత్రం స్నానంచేశాక పెట్టుకోటం మర్చిపోయా! ఒక వేళ స్నానాల గదిలో వుందేమో!" అంటూ వెళ్ళి గాలించి వచ్చింది. అక్కడా కనపడక పోయేసరికి "బల్ల మీదుంచానేమో? ఎదురుగా మెరుస్తుంటే రవ్వల పుడకని ఎత్తుకు పోయుంటాడు! వాడికి పెద్దరోగం రాను! వాడి చేతులు పడిపోను!" అంటూ కనపడని దొంగని శాపనార్థాలు పెట్టసాగింది బాచీ తల్లి!

"అమ్మగారి ముక్కు నుంచే ఎట్టా దగా దగా మెరుత్తుండేది! ఆ దొంగ చచ్చినాడికెట్టా చేతులొచ్చినయ్యో!" అంటూ మెటికలు విరిచింది రామి అంట్లు తోముతూనే.

బాచీ నెమ్మదిగా రామి దగ్గర కూర్చుని "రామీ! దొంగాడెలా వచ్చాడు? వాడెటా వుంటాడు?" అని అడిగాడు.

"ఏమో బాబూ! నాకేం తెల్సు? నువ్వు బాగా చదూకుంటున్నావు గదా! నీకు దొంగాళ్ళ నెలా పట్టుకోవాలో సదూ చెప్పరా?" అంది రామి.

"ఓ! చెపుతాను! నేను బాలపత్తేదారుని. దొంగ ఎలా వచ్చాడో చెబుతానుండు" అంటూ లోపలకు పరుగెత్తుకొని వెళ్ళి బూట్లు తొడుక్కుని టోపీ పెట్టుకొని చిన్న కర్రను చంకనుంచుకుని ఇంటి చుట్టూ తిరగసాగాడు బాచీ!

మామూలుగా అయితే బాచీబాబు మార్చి చూచి పకపకా నవ్వేదే రామి. కాని ఆ పూట అమ్మగారి హడావిడిలో సగం దానికీ వచ్చింది. ఇరుగు పొరుగు వాళ్ళందరతోనూ ముక్కుపుడక దొంగతనం గూర్చి వివరాలు చెబుతూ బాచీని పట్టించుకోలేదు.

ఇంటిచుట్టూ తిరిగాక ఏం చేయాలో తోచలేదు బాచీకి! ఏమీ తోచనపుడు పెరట్లోని మామిడి చెట్టెక్కి కూర్చోవడం అలవాటు వాడికి! అదే చేశాడు. చెట్టు కొమ్మమీద నుంచి పెరడంతా పరీక్షగా చూడసాగాడు. ఎక్కడా దొంగవాడు గానీ, అమ్మ ముక్కుపుడకగాని కనపడలేదు!

తల పక్కకు తిప్పితేపై కొమ్మన గువ్వ గూటిలో తళుక్కుమంటూ మెరుస్తున్నదేమిటో అని చేయిపెట్టి తీశాడు బాచీ! అమ్మ ముక్కుపుడక!

"అమ్మా! ముక్కుపుడక దొరికిందే!" పరిగెత్తుకుంటూ వెళ్ళాడు లోపలకు.

"స్నానం చేసేప్పుడు నీళ్ళవెంట పెరట్లోకి పోయుంటుంది. గువ్వ గూట్లోకి పట్టుకెళ్ళింది" అంది అమ్మ.

మరి రాత్రి పెరటితలుపు తీసినదెవరూ?! దొంగతనంగా రెండో ఆటకు వెళ్ళివచ్చి పెరటితలుపుగుండా లోపలకు వచ్చి పడుకుని నిద్రపోతున్న బాచీ అన్న కృష్ణ మాత్రం యీ గొడవ పట్టించుకోకుండా యింకా గుర్రుపెట్టి నిద్రపోతూనే వున్నాడు!